క్లుప్తంగా

నేటినుంచి పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా



దేవాది వద్ద మోటార్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

నరసన్నపేట: మేజరు పంచాయతీలో మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా చేసున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్ కృష్ణబాబు సోమవారం తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మోటార్లు కాలిపోవడంతో వారం రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఆరు మోటార్లకు మరమ్మతులు చేయించామన్నారు. తాగునీటి సరఫరాను పూర్తి స్థాయిలో చేస్తామన్నారు.

రూ.40 వేల ఆర్థికసాయం



ఉగాదికి ఆర్థికసహాయం చేస్తున్న స్నేహితులు

సరుబుజ్జిలి: అనారోగ్యంతో మంచానపడిన స్నేహితుడిని తోటి మిత్రులు ఆదుకున్నారు. కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్న తెలికిపెంట గ్రామానికి చెందిన నడిమింటి ఉగాది తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనతో కలిసి చదువుకున్న మిత్రులంతా రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కోనేరును బాగుచేయాలని వినతి



ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తుడు

సారవకోట: మండల కేంద్రంలోని శివ రామ పాత్రుని కోనేరును బాగు చేయించాలని గ్రామానికి చెందిన పలువురు కోరారు. సోమవారం మండల పరిషత్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్ల నుంచి మండల కేంద్రానికి జల వనరుగా ఉన్న చెరువు పూర్తిగా పూడికలతో నిండిపోయిందన్నారు. కనీసం స్నానం చేసేందుకు కూడా నీరు పనికిరాకుండా పోయిందన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



సారెను సమర్పించిన భక్తులు

కొత్తూరు: మండలంలో కర్లెమ్మ పంచాయతీ పరిధి మహసింగిలోని గల వరహా లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అమ్మవారికి సోమవారం భక్తులు 51 రకాల వంటలతో సారెను సమర్పించారు. స్వామివారి కల్యాణ ఉత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. పేదలకు ఆలయ కమిటీ ప్రతినిధి గోగులు వరప్రసాదరావు నాయుడు ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ప్రముఖ ప్రవచన కర్త యాలాల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: మండలంలోని బోరుభద్ర గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయ 38వ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి కల్యాణం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంస..



ప్రశంసాపత్రంతో భవానీ

పొందూరు: స్థానిక పోస్టు మెట్రిక్ ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ ఇంటర్మీడియెట్‌లో 924 మార్కులు సాధించిన గండి భవానీకి ప్రశంసాపత్రం, నగదు రివార్డును ప్రభుత్వం అందించింది. ఈ విద్యార్థిని పొందూరు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసింది. ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు బాలవీరాంజనేయులు, గుమ్మడి సంధ్యారాణి, తదితరులు భవానీని సత్కరించారు.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?



లొద్దలకాగితాపల్లి వద్ద శిథిలమైన షట్టర్

- ముంచుకొస్తున్న ఖరీఫ్ సీజన్
- పనిచేయని షట్టర్లు
- శిథిలమైన కల్వర్టులు
- రైతులకు తప్పని సాగునీటి ఇబ్బందులు



చెవ్వాకులపేట వద్ద అధ్వానంగా ఉన్న ఓపెన్ హెడ్ ఛానల్

సరుబుజ్జిలి: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందివచ్చే సమయంలో పాడైతే ఆ బాధ వర్ణనాతీతం. వంశధార ప్రధాన కాలువలు, పిల్ల కాలువలతోపాటు, ఓపెన్ హెడ్ ఛానళ్ల అధ్వానంగా ఉండటంతో ప్రతిఏటా సాగునీటి కష్టాలు తప్పడంలేదు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 22,340 వేల హెక్టార్లు సాగు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

మరమ్మతులు కరువు..

పంట చేతికి అందివచ్చే దశలో సాగునీరు అందక ప్రతిఏటా రైతులు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నారు. ప్రధానంగా కౌలు రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి అప్పుల పాలవుతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం వలన రైతులు చుక్కనీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు. సరుబుజ్జిలి మండలంలోని ఎ.ఎల్. నగరం నుంచి పురుషోత్తపురం వరకు సుమారు 16 కిలో మీటర్ల మేర వంశధార కుడి ప్రధాన కాలువ, 22 పిల్ల కాలువలు విస్తరించి ఉన్నాయి. వీటి ద్వారా 4 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు. 14 కిలో మీటర్లు మేర యరగాం–పురుషోత్తపురం ఓపెన్ హెడ్ ఛానల్ విస్తరించి ఉంది. ఈ కాల్వ ద్వారా సుమారు 2 వేల హెక్టార్లలో ప్రతి ఏటా వరి సాగు జరుగుతుంది.

పాడైన షట్టర్లు..

వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు, పిల్ల కాలువలకు ఏర్పాటు చేసిన షట్టర్లు నిర్వహణ సక్రమంగా చేయడంలేదు. చెక్‌డ్యామ్‌లు, షట్టర్లకు మరమ్మతులు చేయకపోవడం వలన సాగునీటిని మళ్లించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

చెక్ డ్యామ్‌లు శిథిలం..

వంశధార ప్రధాన, పిల్ల కాలువల్లో ఏళ్ల తరబడి చెక్ డ్యామ్‌ల నిర్మాణాలు చేయలేదు. పాత చెక్‌డ్యామ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనివలన సాగునీరు కాలువ నీటిని పక్క భూములకు మళ్లించడానికి రైతులు నానా తిప్పలు పడుతున్నారు.

పర్యవేక్షణ లేదు



కాలువల పనితీరుపై అధికారుల పర్యవేక్షణ లేదు. షట్టర్లు, చెక్ డ్యామ్‌లు నిర్వహణ, సాగునీటి పంపిణీ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించాలి.
– తులగాపు తిరుపతిరావు, రైతు, రావివలస, సరుబుజ్జిలి మండలం

ప్రతిపాదనలు పంపించాం

వంశధార ప్రధాన, పిల్ల కాలువల్లో పనులు కోసం నూతనంగా ప్రతిపాదనలు పెట్టాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.
– పి.వెంకటరావు, జేఈ, వంశధార

ఆమదాలవలస నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం(హెక్టార్లలో) వివరాలు..				
మండలం	సరుబుజ్జిలి	బూర్జ	ఆమదాలవలస	పొందూరు
సాగు విస్తీర్ణం	5,200	5,080	5,400	6,640

వైఎస్సార్‌సీపీ బలోపేతమే ధ్యేయం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న చింతాడ రవికుమార్, గ్రామస్తులు

పొందూరు: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ కోరారు. సోమవారం గారపేటలో ఆ గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ సత్యప్రసాద్, మాజీ సర్పంచ్ గార ఉమాకుమారి, మాజీ సర్పంచ్ కెల్ల అప్పలనాయుడు, పార్టీ నాయకులు గార వెంకటరమణ, పట్నాన రమణ, సారిక సూర్యారావు, వల్ల రమణ, నెల్లి పైడి నాయుడు, చిత్రి పైడినాయుడు, సారి అప్లపనాయుడు, గార గోవింద, గుడివాడ శేఖర్, కొంచాడ అశోక్, సారిక మహేష్, పనస రాము, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించండి



హిరమండలం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గిరిజనులు

హిరమండలం: మండలంలోని గులమూరు పంచాయతీ జగన్నాథపురంలోని గిరిజనుల భూములను రక్షణ కల్పించాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల భూ సమస్యలను పరిష్కరించాలని గిరిజనులతో కలిసి ధర్నా చేశారు. తహసీల్దార్ ఎన్.హనుమంతురావు, ఎంపీడీఓ ఆర్.కాశీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సారవకోట మండలంలో..

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు పంచాయతీ బొంతు గూడకు చెందిన పలువురు గిరిజనులు తమకు సాగు హక్కు కల్పించాలని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ రవికి సోమవారం వినతిపత్రం అందించారు. 25 ఏళ్లుగా బొంతు గూడలో పోడు వ్యవసాయం చేసుకుంటున్నామని, సాగు హక్కు కల్పించాలని కోరారు. డీటీకి వినతిపత్రం అందించిన వారిలో సీపీఐ నాయకులు లండ వెంకటరావు, కొన్న శ్రీనివాసరావు, లక్కోజు శ్రీనివాసరావు ఉన్నారు.

బూర్జ మండలంలో..

బూర్జ: మండలంలోని అన్నంపేట పంచాయతీ జె.వి.పురం రెవెన్యూ పరిధిలో ఉన్న భూములు సాగు చేస్తున్న రైతులకే చెందాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ వై.వి.పద్మావతికి వినతిపత్రం అందజేశారు.

గోగు సాగుకు అనుకూలం

- కలిసి వచ్చిన వర్షాలు
- ముమ్మరంగా వేసవి దుక్కులు



పొలాన్ని ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతులు

జలుమూరు: ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు రానున్న ఖరీఫ్ సీజన్‌కు సమాయత్తం అవుతున్నారు. ఇందులో భాగంగా వేసవి దుక్కులు ప్రారంభించారు. నరసన్నపేట నియోజకవర్గం పరిధిలో మెట్టు, పల్లం భూమి కలిసి సుమారు 80 వేల ఎకరాలు ఉంటుంది. ఇందులో 65 వేల ఎకరాల్లో వరి పంట సాగుచేస్తారు. ఇందులో 50 వేల ఎకరాల వరకు వెద పద్ధతిలో వరి సాగుచేయగా.. మిగిలిన ఐదు వేల ఎకరాల్లో నాట్లు వేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మిగిలిన 15 వేల ఎకరాల్లో గోగు, మొక్కజొన్న, చెరకు, కూరగాయలు, తదితర ఇతర వాణిజ్య పంటలు సాగువుతున్నట్లు అంచనా. ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాక్టర్లతో దుక్కి చేస్తున్నారు. జలుమూరు మండలంలోని మెట్ట ప్రాంతాలైన యలమంచిలి, బుడితి, అక్కురాడు, కామినాయుడుపేట, చెన్నాయవలసతో పాటు నరసన్నపేట, పోలాకి, సారవకోట మండలాల్లో కూడా గోగు సాగు సుమారు రెండు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దుక్కులు చేయడం వల్ల వెద పద్ధతిలో వరి సాగు చేసుకొనే రైతులకు మరింత సులవు అవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇటీవల గ్రామాల్లో నిర్వహించి పొలం బడి కార్యక్రమం కూడా ఉపయోగపడిందని రైతులు చెబుతున్నారు.

వేసవి దుక్కులు వల్ల కలిగే ప్రయోజనాలను జలుమూరు మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ వివరించారు.



- భూమి లోతుగా ఏర్పడి మట్టి తిరగబడి సారవంతంగా అవుతుంది.
- భూమిలో నీరు నిల్వ ఉంటుంది
- శిలీంద్రాలు, పంటను నాశనం చేసే పురుగులు, వాటి గుడ్లు చనిపోతాయి.
- దుక్కి వల్ల పురుగులు బయటకు రావడంతో పక్షులు వాటిని తినేస్తాయి.
- భూమి ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ల తగ్గుముఖం పడతాయి.
- విత్తనాలు వేసేకునందుకు మరింత ఉపయోగం.
- కలుపు నివారణ సాధ్యమవుతుంది.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పాతపట్నం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఉచిత శిక్షణ తరగతులు త్వరలో నిర్వహించనున్నామని పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు సోమవారం తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 10వ తరగతి, ఆపై చదువుకున్న నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గలవారు పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్‌కు వచ్చి సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ 95532 92734 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీఎఫ్‌టీకి షోకాజ్ నోటీసు

మెళియాపుట్టి: ఉపాధి పథకంలో బీఎఫ్‌టీ (బేర్‌ఫుట్ టెక్నీషియన్)గా వెంకటరమణ (టెక్నికల్ అసిస్టెంట్ నిర్వహించాల్సిన విధుల స్థానంలో) విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల పెద్దపద్మాపురం గ్రామ పంచాయతీలోని వేతనదారులకు ఇబ్బందులకు గురిచేయడంతో వారు పనులకు హాజరుకాకుండా నిలిపివేశారు. వెంకటరమణపై ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. సోమవారం వెంకటరమణకు షోకాజ్ నోటీసును ఎంపీడీఓ నరసింహ ప్రసాద్ పండా జారీ చేశారు. దీనిపై వెంకటరమణ రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



గ్రంథాలయంలోకి చేరిన వర్షం నీరు

ఆమదాలవలస: పట్టణంలో సోమవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. శ్రీకాకుళం రోడ్డు అండర్ టన్నల్ వేలో వరద నీరు చేరింది. శాఖా గ్రంథాలయం భవనంలోకి నీరుచేరింది. వర్షం నీటిని గ్రంథాలయ సహాయకురాలు జయలక్ష్మి బయటకు తోడారు. వర్షం కారణంగా పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల మామిడికాయలు నేలరాలాయి.

మద్యం దుకాణం తొలగించాలి



జేసీకి ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

పాతపట్నం: మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే అక్కడ నుంచి తొలగించాలని ఆ కాలనీ వాసులు రెగెటి ఆనందరావు, సలాన చిరంజీవి, గేదెల రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీ కోసం) కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు ఫిర్యాదు చేశారు. జనావాసల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో కాలనీ వాసులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 15 రోజులుగా మద్యం దుకాణం వద్ద మహిళలు నిరసన చేపట్టినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

విరిగిన పలకలు



ఆమదాలవలస మున్సిపాలిటీ 8వ వార్డు కొత్త వీధి, మేదర వీధిలోని ప్రధాన రహదారిపై గల మురుగు కాలువపై పలకలు కూలిపోయాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కల్వర్టుపై పలకలు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించినా.. పట్టించుకోలేదని ఆ వీధికి చెందిన సీనియర్ న్యాయవాది బురెళ్ల సీతారాం తెలిపారు. కల్వర్టుపై పలకలు ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.
– ఆమదాలవలస

బోరు బాగు చేయరూ..



పాతపట్నం మండలం పెద్దలోగిడి గ్రామంలోని ఎస్టీ వీధిలో గల తాగునీటి బోరు నాలుగు నెలల క్రితం మరమ్మతులకు గురైంది. వేసవి కావడంతో తాగునీటి కోసం ఆ వీధి వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బోరును బాగుచేసి, పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.
– పాతపట్నం

దుర్వాసనతో అవస్థలు..



ఆమదాలవలస తహసీల్దార్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న డ్రైనేజీ కంపుకొడుతోంది. కాలువ నిండా పిచ్చిమొక్కలు, చెత్త పేరుకుపోవటంతో మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేదు. కార్యాలయం ఎదుట దుర్వాసన వెదజల్లుతోంది. కార్యాలయానికి వచ్చిన ప్రజలు ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. ఇటు పురపాలక, అటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
– ఆమదాలవలస రూరల్

జ్ఞాపకాల ఒడిలో..



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990లో పదో తరగతి చదవిన విద్యార్థులు 34 ఏళ్ల తరువాత సమావేశమయ్యారు. మొత్తం 70 మంది పూర్వ విద్యార్థులు సోమవారం నరసన్నపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సందడి చేశారు. విద్యార్థి దశలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒక సంఘంగా ఏర్పడి భవిష్యత్ కార్యక్రమాలు నిర్వహణకు సిద్ధమయ్యారు. పూర్వ విద్యార్థులు అందరూ ఒకేరకమైన దుస్తులు ధరించి సమావేశానికి హాజరుకావడం ఆకట్టుకుంది. ఊణ్ణ రంగనాథ్, పాట్నూరు సాయిప్రసాద్, గొద్దు చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.
– నరసన్నపేట

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు సమయానికి హాజరుకారా? అంటూ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాయలంలో సోమవారం ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. సచివాలయ సబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సమాయానికి రావటంలేదని పలువురు ఎంపీటీసీలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓకు ఆదేశించారు. 11 గంటల సమయానికి కేవలం నలుగురు అధికారులు మాత్రమే సమావేశానికి హాజరుకావడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. రేషన్ పంపిణీలో ఎండీయూ వాహనాల సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని పొందూరు ఎంపీటీసీ–4 బాడాన హరిక సభ దృష్టికి తీసుకెళ్లారు. పొందూరు పైడికొండలో 39, 42 సర్వే నంబర్లలో అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా పొందిన ఫేక్ డీ–పట్టాలపై నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ ఆర్.వెంకటేష్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎంపీడీఓ మన్మధరావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అనంతరం పొందూరు జూనియర్ కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు బార్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందించారు.

సందడిగా నర్సుల దినోత్సవం



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నర్సులు

నరసన్నపేట: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందడిగా నిర్వహించారు. నర్సింగ్ సూపరిటింటెండెంట్ శాంతికుమారి, హెడ్ నర్సులు రమణి, కృష్ణవేణి, రమామోహిని, త్రినాథమ్మ, నర్సులు, ఆఫీస్ ఏఓ ఏపీపీ రమణమూర్తి తదితరులు కేక్ కట్ చేశారు. నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. శాంతికుమారి మాట్లాడుతూ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు.